ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 20 | సంచిక : 4 | డిసెంబర్ 2014

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 12

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు॥ 150/-
విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

ఆగష్టు 2014
అరుణాచలం
అక్టోబర్ 2014
అరుణాచలం

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## భగవాన్ శ్రీ రమణ మహర్షి

క్రీ॥శ॥ 1879 డిసెంబరు 30న, తమిళనాడు రాష్ట్రంలోని మధురై పట్టణానికి సమీపంలోని తిరుచ్చుళి గ్రామంలో, అళగమ్మ సుందరం అయ్యరు పుణ్యదంపతులకు వరప్రసాదంగా జన్మించిన 'వేంకటరామన్' తరువాతకాలంలో భగవాన్ శ్రీరమణమహర్షిగా, అరుణాచల రమణుడిగా, ప్రసిద్ధిగాంచి ప్రపంచం నలుమూలలనుండి జిజ్ఞాసువులను ఆకర్షించి హృదయాభిముఖులను చేసారు. తన పదిహేడవ ఏట మధురైలో అమృతానుభవమును పొంది, తరువాత సెప్టెంబరు ఒకటి 1896న అరుణాచలంలో అడుగిడినప్పటి నుండి దేహము విడిచిపెట్టేవరకు, ఏబదినాలుగు సంవత్సరములు, అరుణాచలక్షేత్రంలో జీవన్ముక్తునిగా సంచరించి, ఎల్లప్పుడు తన సహజస్థితిలో ఉండి, మౌనముద్వారా మరియు వాక్కుద్వారా బోధించేవారు. భగవాన్ శ్రీ రమణుల జీవితవిధానం, ఆయన కర్మాచరణ, ఆయన మాట, ప్రతీది మానవాళికి ఉపదేశములుగా పనిచేసాయి. శ్రీ అరవిందులు భగవాన్ రమణుని 'శాంతిచక్రవర్తి'గా అభివర్ణించేవారు. భగవాన్ జీవితం పరిపూర్ణ శరణాగతికి నిలువెత్తు నిదర్శనం. ఆయన దేశ, కాల, నామ, రూప, వ్యక్తిత్వములకు, అతీతమైన ద్వంద్వాతీతస్థితిలో నిలిచిన పరమవైరాగ్యమూర్తి. భగవాన్ 'నేను' అని ఉచ్చరిస్తే అది అఖండచైతన్యమే! వాస్తవంగా నీవెవరివో? తెలుసుకోమన్నది భగవాన్ బోధాసారము. అట్టి మన నిజ తత్త్వాన్ని అనుభవైకవేద్యం చేసుకోవడానికి గురుబోధ అవసరము. గురుబోధను శ్రవణంచేసి, మననంచేసి, ఆచరించి, స్వరూప అమృతస్థితిలోనికి 'నేను'గా 'తాను'గా మేల్కొనుటయే జీవితగమ్యం. భగవాన్ శ్రీరమణమహర్షి శరీరధారియై ఉన్నకాలంలో ఆర్తులకు, దుఃఖితులకు, ముముక్షువులకు, అందరికీ నీడనిచ్చే వృక్షంలా ఆశ్రయం ఇచ్చి హృదయాభిముఖులను చేసారో, అట్లే నేటికి, నిరంతరం చేస్తూనే ఉన్నారు. భగవాన్ అంటే అనంతమైన ఆత్మ కాబట్టి వారి దయ, ప్రేమ, కృపాపూర్ణ మార్గదర్శకత్వము, అనుగ్రహము, దేశ కాలములకు అతీతంగా నిరంతరము పనిచేస్తూనే ఉన్నాయి. అందుకు తగిన అర్హతను మనము సంపాదించుకోవాలి.

ఓంతత్‌సత్

(ది॥ 30-12-2014 శ్రీ రమణ జయంతి సందర్భంగా)

- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, ఆగష్టు 2014, అరుణాచలం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

కోరికలు నెరవేర్చే కొండ అని అరుణాచలం కొండ గురించి శివపురాణంలో, స్కాందపురాణంలో ఉంది. మనస్సును నిగ్రహించు కోవటం చాలా కష్టం. గాలిని పోగుచేసుకోవటం ఎంత కష్టమో మనస్సుని నిగ్రహించుకోవటం కూడా అంతే కష్టం. ఈ కొండకు చలనం లేదు, అది అచలం. ఆ కొండను నిరంతరం స్మరించటంవలన, నిరంతరం కొండను ధ్యానించటం వలన, ఆ కొండను ఏకాగ్రంగా చూడటం వలన మనస్సు నిర్మలమవుతుంది, నిశ్చలమవుతుంది, ఆ కొండ ఎంత స్థిరంగా ఉందో నీ మనస్సుకు అంత స్థిరత్వం వచ్చేస్తుంది. ఏక వస్తువును స్మరించటంవలన, ధ్యానించటంవలన మన మనస్సు స్థిరపడుతుంది. తరువాత నెమ్మదిగా మనోనాశనం అవుతుంది, అయితే మీకు అక్కడ విశ్వాసం కుదరాలి. రమణమహర్షిగారికి గురువు లేడని మీరు అనుకోవద్దు. ఆ కొండే ఆయనకు గురువు, అరుణాచలేశ్వరుడే ఆయనకు గురువు. ఆయన దగ్గర భక్తులు ఎవరూ లేనప్పుడు గ్రౌండులో ఒకచోట కూర్చుని నిరంతరం అలా కొండవంక చూచుకొనేవారు. ఏమండి స్వామి మీరు ఎక్కువగా ఆ కొండవంక చూస్తున్నారు, ఇంక మీకు అదే పనా అని ఎవరైనా అడిగితే నేను కొండవంక చూడటంలేదు, నన్ను నేనే చూసుకుంటున్నాను, అది వేరు నేను వేరు కాదు, ఉన్నది ఒక్కటే అనేవారు. బ్రాహ్మీస్థితిని పొందినవాడికి ఈ సృష్టిలో చూడవలసింది అంటూ ఏమీలేదు, వినవలసింది అంటూ ఏమీలేదు, తెలుసుకోవలసింది అంటూ ఏమీలేదు.

నిన్ను ఎంతో ప్రేమిస్తున్నట్లు నటించేవారు కూడా నువ్వు చనిపోయిన తరువాత వారు కాఫీ తాగటానికి లేటు అవుతుందని ఈ శవాన్ని తొందరగా తీసుకుపోండి, తొందరగా తీసుకుపోండి అని అక్కడ ఉన్న పెద్దమనుషులతో చెపుతారు. నారదుడు రత్నాకరుడితో అంటాడు "నువ్వు చాలామందిని దోచుకొంటున్నావు, నన్ను కూడా దోచుకోవటానికి వచ్చావు, నా దగ్గర ఉన్నది ఇచ్చేస్తాను లేకపోతే చంపేస్తావు కదా, సరే బాగానే ఉంది కాని నువ్వు ఒక్కడివే ఈ చెడ్డపనులు చేస్తున్నావు. ఇంట్లో పదిమంది తింటున్నారు, ఆ చెడ్డపనుల వలన నీకు పాపం వస్తుంది. ఆ పాపాన్ని వారు అందరూ పంచుకోవాలి కదా! నువ్వు ఇంటికి వెళ్ళి తెలుసుకునిరా" అని చెప్పాడు. రత్నాకరుడు ఇంటికి వెళ్ళి "నేను దొంగతనాలు చేసి సంపాదించి మీ పదిమందికీ పెడుతున్నాను కదా! నేను చేసే పాపాన్ని మీరు అందరూ పంచుకోవాలి" అని చెప్పాడు. అప్పుడు ఇంట్లోవారు ఏమన్నారు అంటే "మాకు భోజనం పెట్టవలసిన డ్యూటీ నీకు ఉంది. నువ్వు పెడితే తింటాము కాని నువ్వు చేసిన పాపాలను

మటుకు మేము పంచుకోము" అని చెప్పారు. అప్పుడు వాడి తల తిరిగింది. రత్నాకరుడు తిరిగి వచ్చి నారదుడితో ఏమన్నాడు అంటే "నేను ఈ వృత్తి చేయనండి, వారు అసలు కొంచెం కూడా పాపం పంచుకోము అంటున్నారు. అందుచేత నేను ఈ వృత్తి మానేస్తాను" అన్నాడు. "వారు ఎంత స్వార్థపరులో ఇప్పుడు నీకు అర్థమయ్యిందా, వారికోసం నీ జీవితాన్ని వ్యర్థం చేసుకొంటున్నావు" అని చెప్పి అప్పుడు నారదుడు వాడికి రామమంత్రం ఉపదేశించాడు. వాడు దానిని ఏకాగ్రంగా చేస్తూ ఉంటే వాడిపైన పుట్టలు లెగిసిపోయినాయి. ఆ పుట్టలలోనుండి బయటకు వచ్చాడు కాబట్టి వాడికి వాల్మీకి అనేపేరు వచ్చింది. తన హృదయంలో ఉన్న సత్యాన్ని డైరెక్టుగా దర్శించాడు కాబట్టి వాడు ఋషి అయ్యాడు. అందుచే వాల్మీకిమహర్షి అంటారు.

నేను ఎవడను? అనే ప్రశ్నకు సమాధానం కనుక మీరు తెలుసుకోగలిగితే ఇంక మీరు తెలుసుకోవలసింది అంటూ ఈ సృష్టిలో ఏమీలేదు. ఏది తెలుసుకొంటే అన్నీ తెలుస్తాయో దానిని తెలుసుకోమని చెపుతున్నారు. మనం నేను, నేను అంటున్నాముకదా, ఈ నేను అనే తలంపు ఏ హృదయంలో నుండి అయితే పుట్టివస్తోందో అక్కడకు అంటే నేను అనే తలంపును దాని మూలంలోనికి ఉపసంహరించాలి, ఉపసంహరించాలి. దాని మూలాన్ని చూసిన వెంటనే ఈ నేను అనే తలంపు నశిస్తుంది. ఇది ఎక్కడైతే నశించిందో అక్కడనుండి ఒక నిజమైననేను, సత్యమైననేను సడన్‌గా విజృంభించివచ్చి నీ సహస్రారాన్ని చుట్టేస్తుంది. అదీ నేనే కాని అది ఈ దేహానికి, మనస్సుకు, ఈ ప్రపంచానికి పరిమితమైనది కాదు. ఇట్ ఈజ్ బాడీలెస్, మైండ్‌లెస్, వరల్డ్‌లెస్ అండ్ గాడ్‌లెస్ ఆల్‌సో. దానికి ద్వితీయం అంటూ ఏమీలేదు. అద్వైతం అంటే అదే. అప్పుడు ఇంక మీకు పునర్జన్మలేదు ఎందుచేతనంటే మీకు జన్మ అవసరంలేదు కాబట్టి రాదు. మీకు అవసరంలేని వస్తువు ఏవరైనా ఇస్తూఉంటే మాకు వద్దండి, ఇది మాకు అవసరంలేదు, అవసరం ఉన్న వారికి ఇవ్వండి అని చెబుతారు. పునర్జన్మ అక్కరలేదు అని మీరు ఏమీ కోరుకోరు. నాచురల్‌గానే, నార్మల్‌గానే ఇంక మీకు పునర్జన్మరాదు.

ఈ శరీరం ఉంటే మనం ఉంటాము, శరీరం లేకపోతే మనం ఉండము అనేటువంటి రాంగ్‌తింకింగ్ మనకు చాలా జన్మలనుండి వస్తోంది. నువ్వు రైట్‌తింకింగ్ లోనికి, రైట్‌పాత్‌లోనికి రావాలంటే గురువుయొక్క సహాయంలేకుండా వచ్చే అవకాశం లేదు. కొన్ని వాసనలు చాలా బలంగా ఉంటాయి. వాటిని బయటకు లాగి కాల్చి బూడిద చెయ్యటం నీవల్లకాదు. దానికి గురువు సహాయం అవసరం. నీ లోపల బరువైన రాళ్ళు ఏమున్నాయో నీకు తెలియదు. అవి నీకు తెలియకపోయినా ఈశ్వరుడికి తెలుసు. ఎందుచేతనంటే

ఆయన మనలో అంతర్యామిగా ఉన్నాడు. ఒకసారి ఓంసాధు భగవాన్ దగ్గరకు పద్యాలు వ్రాసుకొని వచ్చాడు. మీరు కుమారస్వామి అవతారం అని, మీరు మహాజ్ఞాని అని ఏదో అలా వ్రాసాడు. భగవాన్ ఏమన్నారు అంటే నువ్వు బాగానే వ్రాసావు. ఇంతకీ ఈ పద్యాలలో అర్థం ఏమిటి నేను చాలా గొప్పవాడిని అని వ్రాసావు. నేను గొప్పవాడిని అయితే నీకు కలిసివచ్చేది ఏమిటి? నువ్వు బాగుపడే విధానం ఏదో చూసుకో. నేను జ్ఞానం సంపాదించాను అని వ్రాసావు. నేను జ్ఞానం సంపాదించటం వలన నీకేమి కలిసివస్తుంది. నువ్వు కూడా జ్ఞానం సంపాదించుకోవటానికి ప్రయత్నం చెయ్యి. నన్ను ఏదిగా వర్ణించావో అది పొందటానికి నువ్వు ప్రయత్నం చెయ్యి అని ఓంసాధుతో భగవాన్ చెప్పారు.

వారు నన్ను మోసం చేసారు, వీరు నన్ను మోసం చేసారు అని మనం చెప్పకొంటూ ఉంటాము కదా! ఇక్కడ భగవాన్ ఏమంటున్నారు అంటే నిన్ను మోసం చేసిన వాడిది ఎంత తప్పో నీదీ అంతే తప్ప అని చెప్పారు. నిన్ను ఎవడో మోసం చేసాడు. వాడి మోసంలో నిన్ను ఎవడు పడమన్నాడు. నీకు తలకాయ లేదన్నమాట. ఆ మోసంలో నువ్వు పడ్డావు అంటే నీకూ ఏదో దురాశ ఉండి ఉంటుంది. దొంగనోట్లు మార్చేవాళ్ళు ఏమంటారు అంటే మీరు మాకు వెయ్యి ఇవ్వండి మేము మీకు పదివేలు కరెన్సీ ఇస్తాము మీరు వాటిని మార్చుకోండి అని చెపుతారు. నీలో ఆశ లేకపోతే నువ్వు ఆ డబ్బు ఎందుకు పుచ్చుకొంటున్నావు. ఇందులో నీదికూడా తప్ప ఉంది. నీ జేబులో డబ్బు ఎవడైనా దొంగతనం చేసాడు అనుకో అందులో నీది కూడా తప్ప ఉంది. ఎందుచేతనంటే వాడు దొంగతనం చేయటానికి నీవు అవకాశం ఇచ్చావు. నువ్వు అజాగ్రత్తగా ఉన్నావు. అందుచేత నిన్ను మోసంచేసినవాడిలో ఎంత దోషం ఉందో, మోసగించబడినటువంటి నీలో కూడా అంతే దోషం ఉంది. నీ అజాగ్రత్తను వాడు ఉపయోగించుకొన్నాడు. ఇది ప్రపంచజ్ఞానం. ఇది కూడా గురువు మీకు చెపుతున్నాడు. ఆధ్యాత్మికానికి దీనికి సంబంధం ఏమిటి అని మీరు అడగవచ్చు. ఇది గురువు యొక్క ప్రేమ. వారు మోసం చేసారు, వీరు మోసం చేసారు అని మీరు అనుకొంటారుగాని మా అమాయకత్వం వలననే వారిచేత మోసగించబడ్డామని మీకు తెలియటంలేదు. వారు మోసం చేసారు అని చెపుతున్నారుకాని దానికి మీ అమాయకత్వం కూడా కారణం అని మీరు అనటంలేదు. వంచకుల వలలో పడి వారు మమ్మల్ని మోసం చేసేసారు అని కుయ్యో, మొర్రో అని ఏడవకండి. అంతా అయిపోయింది ఇంక సున్న మిగిలింది అని అలా అనుకోవద్దు. దానినే తపిస్తూ నశించిపోవద్దు. కొంతమంది భార్యాభర్తలు పేచీలుపెట్టుకొని చనిపోతారు. భక్తులలో కూడా ప్రమాదం ఉంది. మీరు మమ్మల్ని ఇంద్రుడు, చంద్రుడు అంటారు అనుకోండి, మీరు చాలా అభివృద్ధి అయిపోయారు, జ్ఞాని అయిపోయారు అని అంటారు అనుకోండి,

వాటిని మేము లోపలకు తీసుకోకూడదు, వాటిని బయటకు వదిలేయాలి. వాటిని లోపలకు తీసుకొంటే మేము పతనమైపోతాము.

మనకు ఏవో సమస్యలు వస్తూ ఉంటాయి. వాటిని పరిష్కారం చేసుకొందాము అనే బుద్ధి మనకు రాదు, ఇంక దీనికి చనిపోవటమే పరిష్కారం అని మనకు అనిపిస్తూ ఉంటుంది. ఆత్మహత్య అనేది మంచిదికాదు. నిన్ను నీవు చంపుకోవటం మంచిదికాదు. దానివలన నీచ జన్మలు వస్తాయి. వంచకుల వలన మీకు ఏమైనా ఇబ్బందులు వస్తే వాటినే తపించుకొంటూ నశించిపోకుండా, ఆ గొడవలను అస్తమానం తలపెట్టుకొని బెంగపెట్టుకొనేబదులు నన్ను స్మరించుకో అంటున్నాడు పరమాత్మ. నిరంతరం ఆ గొడవలలో ఉండి టైము పాడుచేసుకొనేబదులు నన్ను స్మరించుకుంటే, చనిపోవాలనే ఆలోచన మానేసి నిరంతరం నన్ను తలపెట్టుకొంటూ ఉంటే నా అనుగ్రహం నీ శిరస్సు మీద పడుతుంది. నీ మనస్సు శుద్ధి అవుతుంది, చనిపోవాలనే బుద్ధి కూడా నీకు పోతుంది. అందుచేత నన్ను స్మరించే బాధ్యత నీది, నిన్ను అనుగ్రహించే బాధ్యత నాది అంటున్నాడు పరమాత్మ. అందుచేత ఎవరైనా వంచకులు నీకు నష్టం కలిగిస్తే అస్తమానం దానిగురించి రోధించకుండా నన్ను స్మరించుకో, నాకోసం జీవించు, ఎందుకు చనిపోవటం. భగవంతుడికోసం జీవించి భగవంతుడిని తెలుసుకోవచ్చుకదా! నిన్ను నీవు చంపుకోవటంవలన తరువాత చెడ్డజన్మలు వస్తాయి. అప్పుడు ఇంతకంటే ఎక్కువ కష్టాలను, ఇంతకంటే ఎక్కువ బాధలను ఫేస్ చెయ్యవలసి ఉంటుంది. అందుచేత ఆ కష్టాలను తలచుకుంటూ చనిపోయేబదులు నన్ను నిరంతరం స్మరించుకోవటం వలన నా అనుగ్రహం నీకు కలుగుతుంది. అప్పుడు నాలో ఐక్యమవుతావు, నా స్వరూపాన్ని పొందుతావు అంటున్నాడు పరమాత్మ. అందుచేత ఎవరైనా చీటర్స్ వలలో నువ్వు పడితే వారినే తలచుకుంటూ ఏడుస్తూ, అన్నం మానేసి ఆరోగ్యం పాడుచేసుకొని చావును కొనితెచ్చుకోవద్దు. ఆ టెన్షన్ టైములోకూడా, జీవించి ఉండటమా, చనిపోవటమా అనే ఆక్రైసెస్‌లోకూడా నన్ను స్మరించటం విడిచిపెట్టవద్దు. అలా స్మరించుకోవటం వలన నా అనుగ్రహం పొందటానికి నీకు అర్హత కలుగుతుంది, అప్పుడు నాలో ఐక్యం అయిపోయి నువ్వు సుఖి అవుతావు, నన్ను స్మరిస్తే సరిపోతుంది అంతకంటే అదనంగా నువ్వు కష్టపడనక్కరలేదు.

మూడు దేహాలు లేవు, మూడు కాలాలు లేవు, మూడు అవస్థలు లేవు. నేను చెప్పేది నిజమే కాని నూటికి నూరుపాళ్ళు మీకు అబద్ధం అనిపిస్తుంది. మనం ఉన్నాము కాని మూడు దేహాలు లేవు అంటే స్థూలశరీరం, సూక్ష్మశరీరం, కారణశరీరం ఇవి మూడూ లేవు. మూడు

కాలాలు లేవు అంటే భూతకాలం, వర్తమానకాలం, భవిష్యత్‌కాలం ఇవి మూడూ లేవు. మూడు అవస్థలు లేవు అంటే జాగ్రదవస్థ, స్వప్నావస్థ, నిద్రావస్థ ఇవి మూడూ లేవు. మూడు దేహాలు, మూడు కాలాలు, మూడు అవస్థలు అసత్యం. అసత్యం అసత్యంగా మీకు కనిపిస్తే మీరు మిగులుతారు. అప్పుడు సుఖం, శాంతి, ఆనందం వచ్చి మిమ్మల్ని ముంచేస్తాయి. అదే పరమస్థితి నేను చెప్పిన విషయం ఇప్పుడు మిమ్మల్ని రంపం పెట్టి కోసేసినా నమ్మబుద్ధి వెయ్యదు. మూడు కాలాలు లేవు, మూడు దేహాలు లేవు, మూడు అవస్థలు లేవు. ఇవి అన్నీ కూడా మన మీద కల్పించబడ్డాయి. కల్పించబడినవి కల్పించినట్టు మనచేత గుర్తించబడితే, ఏ వస్తువు మీద ఇవి కల్పించబడ్డాయో అది మనకు ఎరుకలోనికి వస్తుంది. అదే చివరి స్థితి, అప్పుడు ఇంక మీరు పొందవలసింది అంటూ ఏమీ లేదు. మూడు కాలాలు లేవు, మూడు అవస్థలు లేవు, మూడు దేహాలు లేవు ఇది మీరు నమ్మలేరు, అందులో మీ పొరపాటు లేదు. దానిని అవగాహన చేసుకొనేస్థాయి మనకు లేదు, దానికి ఇంక మనం డిజర్వు అవ్వలేదు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, అక్టోబరు 2014, అరుణాచలం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భవిష్యత్‌కాలం గురించి, భూతకాలం గురించి ఎక్కువగా ఆలోచించకూడదు. దాని వలన మనకు వర్తమానకాలం పాడైపోతుంది. నీ చేతిలో ఉన్న పనిని శ్రద్ధగా చెయ్యి. భవిష్యత్ కాలం ఎలా ఉంటుందో మనకు తెలియదు. జ్ఞాని కాలాన్ని జయిస్తాడు. ఎందుచేతనంటే సత్యంలో కాలం ఉండదు. ప్రకృతిలో కాలం ఉంటుంది. బ్రహ్మస్వరూపం తెలిసినవాడికి, సత్యానుభవం పొందినవాడికి అసలు కాలం లేదు. వారికి సహాయం చెయ్యండి, వీరికి సహాయం చెయ్యండి అని రామకృష్ణుడు చెప్పేవాడు కాని భగవాన్ ఎప్పుడూ అలా చెప్పలేదు. అంటే ఇతరులకు సహాయం చెయ్యవద్దు అనికాదు. దానికి కారణం ఏమిటి అంటే ఒక మనిషి ఇతరులకు ఏదైనా సహాయంచేస్తే అది వాడికి తిరిగి వచ్చేస్తుంది. వాడిది వాడికే తిరిగి వచ్చేటప్పుడు ఇంక ఇతరులకు సహాయం చేసేది ఏముంది? అందులో సహాయంలేదు. కుడిచేతిలో ఉన్నది ఎడమచేతిలో పెట్టుకొన్నట్లు అవుతుంది. నేను వారికి సహాయం చేసాను, వీరికి సహాయం చేసాను అనుకొంటే నెమ్మదిగా అహంభావన పెరిగిపోతుంది, నువ్వు లోపల కుళ్ళిపోతావు. నువ్వు ఇతరులకు ఇచ్చింది తిరిగి నీకేవస్తుంది అని తెలియక వారికి సహాయం చేసాను, వీరికి సహాయం చేసాను అనుకొంటావు. ఇచ్చేవాడు లేడు, తీసుకునేవాడు లేడు, ఉన్నది ఒక్కటే. అన్నదమ్ములు ఆస్తులు పంచుకుంటారు. అంటే అది షేరింగ్. నువ్వు ఇతరులకు ఏదైనా ఇచ్చినా అది ఇవ్వటంకాదు, దానిని షేరింగ్ అనుకో.

రామకృష్ణమఠ్ స్వామీజీతో మీరు అన్నీ మంచిపనులే చేస్తున్నారు అన్నాను. దానికి ఆయన ఏమి చెప్పారు అంటే ఇప్పడు రామకృష్ణుడి శరీరంలేదు, మాకు శరీరాలు ఉన్నాయి. అందుచేత ఈ శరీరాలతో మేము ఏదో మంచి పనులు చేస్తున్నాము అని మీరు అనుకొంటారు గాని మేము సున్నలం అని చెప్పారు. సున్నకి కూడా విలువ ఉంది కదా అని అడిగాను. సున్నకు విలువ ఉన్నమాట నిజమేకాని ప్రక్కన ఏదో ఒక అంకె ఉంటే కదా దానికి విలువ, ఆ అంకె రామకృష్ణుడు అని చెప్పారు. రామకృష్ణుడికి మొహమాటంలేదు. ఆయన దగ్గరకు డబ్బు ఉన్నవారు, పెద్దవాళ్లను తీసుకొనివెళితే వీరికి అన్నీ ఉన్నాయి, అంతర్ముఖత్వం లేదు అనేవారు. వారికి డబ్బు ఉండవచ్చు, విద్య ఉండవచ్చు, ఇవన్నీ బయట గొడవలు, ఈ గొడవలు అనవసరం. మనస్సును అంతర్ముఖం చేయాలి అనే విషయం కూడా వారికి తెలియటంలేదు. రాముడు వాలిని చెట్టుచాటునుండి చంపాడు, అలా చంపకూడదు కదా అని చాలామంది అంటారు. దీనికి రాజగోపాలాచారి ఏమన్నాడు అంటే ఆ పని పెరుమాళ్ళు చేసాడు కాబట్టి మనం ఏమి అనకూడదు అని చెప్పాడు. అది కాదు. అక్కడ అర్థం ఏమిటి అంటే ఇంకోరకంగా వాడు చనిపోడు, వాడిని ఎలా చంపాలి అనుకొన్నాడో ఆరకంగా చంపాడు, ఎలా అయితే వాడు చనిపోతాడో ఆ రకంగా చంపాడు, అది విషయం. కృష్ణుడు అబద్దాలు చెప్పాడు, ధర్మరాజుచేత అబద్ధాలు చెప్పించాడు అంటే ఇన్ని చేసినా ఆయన దేవుడే. ఎందుచేతనంటే ఆయన హృదయంలో దోషం ఏమీ లేదు. ఆయన ఏది చేసినా ఇతరులకోసం చేసాడు కాని అందులో స్వార్థం లేదు. మనం ఆయన హృదయాన్ని చూడాలి. రాముడు, కృష్ణుడు అనికాదు మనం ఒక మనిషిని చూసేటప్పడు వాడి హృదయాన్ని చూడాలి. సౌందర్యం బయట ఏమీలేదు, లోపల హృదయంలోనే ఉంది.

భౌతికంవేరు, ఆధ్యాత్మికంవేరు అనుకొంటారు. రెండూ ఒక్కటే. మనం ఏదైనా పనిచేసేటప్పడు స్పిరిట్యువల్ ఔట్‌లుక్‌తో అంటే ఆధ్యాత్మిక దృక్పథంతో చేస్తే, ఈశ్వరార్పితంగా కనుక పనిచేస్తూ ఉంటే మనం చేసే ప్రతి పని ఆధ్యాత్మికమే. నీ మనస్సును బాగుచేసే ప్రతీ కర్మా ఆధ్యాత్మికమే. స్వార్థం లేకుండా నువ్వు ఏ పని చేసినా అది అంతా ఆధ్యాత్మికమే. మంచి పనిచేసి నువ్వు ఏమీ ఆశించలేదు అనుకో, మంచి మంచికోసమే చేస్తున్నావు అనుకో, ఆ పని భౌతికం అవ్వదు, అంతా ఆధ్యాత్మికమే. భగవంతుడికి రూపం ఉందా, రూపం లేదా అని దాని గురించి చర్చ అనవసరం. ఆయనకు రూపం ఉండటానికి, రూపం లేకపోవటానికి తేడా ఏమీలేదు. రూపంలో ఉన్నా ఆ రూపంతో ఆయనకు తాదాత్మ్యం ఉండదు. రూపం ఉన్నప్పడు కూడా తను ఎవడో తనకు తెలుస్తూ ఉంటుంది. తానెవడో తనకు తెలుస్తున్నప్పడు రూపం ఉంటే నష్టం ఏమిటి? అక్కడ దేహానికి ప్రాముఖ్యత లేదు. దేహం ఉన్నా ఉన్నాడు, దేహం

లేకపోయినా ఉంటాడు. అందుచేత దేహం గొడవ మనకు అక్కరలేదు.

కారుకు డ్రైవరు ఎటువంటివాడో మన శరీరానికి బుద్ధి అటువంటిది. మన శరీరాన్ని నడిపేది మన బుద్ధే. ఆ బుద్ధిని బాగుచేయమని, బుద్ధిని నిదానంగా ఉంచమని, బుద్ధిని పవిత్రం చేయమని గాయత్రిలో చెపుతాడు. నీ బుద్ధి పాడైపోతే నీకు వెయ్యికోట్లు డబ్బు ఉన్నా అనవసరం. కోపం ఎక్కువ ఉన్నవాడు ఎన్ని చెడ్డపనులు అయినా చేస్తాడు. కోపం ఎక్కువ వచ్చినప్పుడు బుద్ధి పనిచేయటం మానేస్తుంది. మన అహంకారం వలన ఇది అంతా మనమే సాధిస్తున్నాము అని అనుకొంటాము కాని చేసేదంతా ఈశ్వరుడే. అంతా ఈశ్వర సంకల్పం ప్రకారమే నడుస్తోంది అనే విషయం జీవితంలో చాలా అనుభవం వచ్చాక మనకు తెలుస్తుంది కాని ఇప్పుడు తెలియదు. ఇప్పుడు నీకు భరించలేనంత దుఃఖం ఉంది అనుకో, నువ్వు అదర్‌నెస్ లేనిస్థితిని పొందితే నీకు ఉన్న మొత్తం దుఃఖం అంతా సడన్‌గా పడిపోతుంది, నువ్వు ఆనందస్థితిని పొందుతావు. ఎంతసేపు బుద్ధుడు చెప్పేది ఏమిటి అంటే మీరు పవిత్రులు అవ్వటానికి ప్రయత్నం చేయండి. నువ్వు ఒకమాట మాట్లాడితే, ఒక పనిచేస్తే, నీకు ఒక తలంపు వస్తే ఇవి అన్నీకూడా నువ్వు పవిత్రుడవు అవ్వటానికి నీకు సహకరించాలి లేకపోతే వాటి ప్రయోజనం ఏమీ లేదు. పవిత్రుడు కానివాడికి లోపలఉన్న సద్వస్తువు వ్యక్తంకాదు. పవిత్రుడు కానివాడు నిర్వాణసుఖాన్ని పొందలేడు. బుద్ధుడు ప్రపంచ ప్రఖ్యాతి పొందాడు అంటే దానికి మానవజాతి మీద ఆయనకు ఉన్న విపరీతమైన ఆప్యాయత, అపారమైన ప్రేమ కారణం. అక్షరాలు కలిపితేనే మాటలు. మాటలు కూడా దేవతలతో సమానమే. వాటిని అక్షరదేవతలు అంటారు. ఒకోసారి దేవతలకంటే అవి మనకు ఉపకారం చేస్తాయి. ఒకసారి తులసీదాసుగారి భార్య ఆయనతో ఏమంది అంటే మీకు నామీద ఉన్న ప్రేమ రాముడిమీదలేదు, రాముడిమీద ఉంటే ఈపాటికి మీకు మోక్షం వచ్చును అంది. ఆ మాట ప్రభావం తులసీదాసుగారిమీద పనిచేసింది. అందుచేత మాటకూడా దేవతే. అది అక్షరదేవత. రాముడు లేడు, కృష్ణుడు లేడు అని అనుకోకూడదు. వారు చెప్పిన మాటలు ఉన్నాయి కదా అవే దేవతలు. ఆ మాటలు గొప్పవి, వాటికి చాలాశక్తి ఉంది.

నువ్వు మంచిపనులు చేస్తూ ఉంటే కొంతమందికి అసూయ వస్తుంది. ఆ అసూయ వలన వారు నీవు చేసే పనిని చెడగొట్టటానికి చూస్తారు. వాటిని తట్టుకొని నువ్వు మంచి చెయ్యాలంటే నీకు శక్తి ఉండాలి. మనం ఈ భూమిమీదకు వచ్చి వెళ్ళిపోతూ ఉంటాము. అంటే ఈ మనుషులు రావటాలు, పోవటాలు ఇది అంతా ఒక లీల. అహంభావన ఉన్నంతసేపు ఈ లీలను మనం అతిక్రమించలేము, అదే మనకు నిజంకింద కనిపిస్తూ ఉంటుంది. ఈ శరీరం ఉండగా అహంభావనను పోగొట్టుకొనే శక్తి మనకు లేనప్పుడు శరీరం చనిపోయిన

అది ఉంటుంది. ఈ అహంభావనే ఇంకో శరీరాన్ని కల్పించుకొని లీలలోకి వచ్చేస్తుంది. దీనినే ఆచార్యులవారు మాయ అన్నారు. యముడు దేహబుద్ధి ఉన్నవాడి దగ్గరకే వస్తాడు. దేహబుద్ధి లేనివాడి దగ్గరకు యముడు రాడు. దేహబుద్ధి లేనివాడికి ఇంక జీవలక్షణాలు ఉండవుకదా, ఇంక ఎవడిని తీసుకొనివెళతాడు. వాడు వచ్చేటప్పటికి నీకు దేహబుద్ధి ఉంటే నీ జీవుడిని తీసుకొనిపోతాడు. మనకు దేహబుద్ధి ఉందికదా అందుచేత మనలను తీసుకొనిపోతాడు. దేహంచనిపోకముందే మనలో దేహబుద్ధి పోయింది అనుకో ఆయన ఇంక మన జోలికి రాడు. యముడు మీ దగ్గరకు రాకముందే మీరు జాగ్రత్త పడండి. వాడు వస్తే మటుకు తీసుకొనిపోతాడు. మరల ఈ లోకంలోనికి పంపేస్తాడు. శరీరం చనిపోవటం అహంకారానికి ఇష్టం ఉండదు. కాని ఆ శరీరం ద్వారా చేయవలసిన కర్మ అయిపోయినప్పుడు ఆ శరీరం చనిపోతుంది, ఇంక ఆగదు, ఈ రోగాలు అన్నీ ఒక వంపు. బ్రహ్మానందం, వాసనానందం, విషయానందం మూడు ఆనందాలు. హృదయంలో ఉన్న సద్వస్తువు అనుభవంలోనికి వచ్చినప్పుడు కలిగే ఆనందం బ్రహ్మానందం. ఏదైనా మంచివార్త నీ చెవిలో పడింది అనుకో, అప్పుడు నువ్వు ఆనందిస్తావు. అది విషయానందం. బ్రహ్మానందం నీకు దొరికే వరకూ వాసనానందంలోనుండి, విషయానందంలోనుండి నువ్వు బయటకు రాలేవు. బ్రహ్మానందం ఒక్కటే స్వతంత్రమైనది. బ్రహ్మానందంకు శరీరంతో సంబంధంలేదు. శరీరం చనిపోయినా అది కంటిన్యూ అయిపోతుంది. బ్రహ్మానందం పొందినవాడికి శరీరం ఉండటం వలన లాభంలేదు, శరీరం పోవటంవలన నష్టంలేదు. మనం శరీరంపోతే బాధపడతాము. బ్రహ్మానందం పొందినవాడు శరీరం చనిపోయినప్పుడు దాని చాకిరీ తప్పింది అనుకొంటాడు.

మీరు చాలా చెపుతున్నారు కాని మేము ఏమీ ఆచరించలేకపోతున్నాము అని అడిగితే మీరు శ్రద్ధగా శ్రవణం చేయాలి, శ్రవణం చేసిన దానిమీద మీకు నమ్మకం కలగాలి. మనం ఏదో వింటున్నాము కాని దాని మీద మనకు నమ్మకం కలగటంలేదు. అసత్యాన్ని విడిచిపెట్టి సత్యాన్ని పట్టుకోండి అని వాడు చెపుతాడు అనుకో ఎన్నో జన్మలనుండి మనం అసత్యానికి అలవాటుపడిపోయాము. అసత్యాన్ని సత్యం అని మనం చాలా బలంగా అనుకొంటున్నాము. దానిని విడిచిపెట్టి సత్యాన్ని పట్టుకోవటం చాలా కష్టం. అసత్యాన్ని విడిచిపెట్టమని శాస్త్రంలో చెప్పినా దానిని విడిచిపెట్టటం అంత తేలికకాదు. మనలో ఉన్న దోషం ఏమిటి అంటే శాస్త్రంలో చెప్పింది కనీసం అది నిజం అని కూడా మన మనస్సు నమ్మటంలేదు. అది నమ్మితే విడిచి పెట్టటానికి ప్రయత్నం చేస్తుంది. మన అలవాట్లు నమ్మకం కలగనివ్వవు. మన పాడుబుద్ధి శాస్త్రాన్ని ఎలా నమ్ముతుంది. అయినా శ్రవణం చేయటం మానకూడదు. అలా వినగా వినగా మన బుద్ధిలో కొంతమార్పు వస్తుంది. వాసనలు నన్ను పీడిస్తున్నాయి. వాటిని

పోగొట్టుకోవటం ఎలా అని భగవాన్‌ను అడుగుతున్నారు. సత్యం నీ హృదయంలో ఉంది. అది సహజంగానే అక్కడ ఉంది. సత్యం నీ హృదయంలో ఎంత సహజంగా ఉంటోందో అంత సహజంగా అక్కడ నీ మనస్సు ఉండగలిగితే వాసనలు వాటంతట అవే కాలిబూడిద అవుతాయి, వాటిని తొలగించుకోవటానికి నీవు ఏమీ ప్రయత్నం చేయనక్కరలేదు. మీది ఏ ఊరు అంటే జిన్నూరు అంటాము. అది అసత్యమే, మనం దేహం అనుకొంటే జిన్నూరు కానీ లేకపోతే జిన్నూరు ఏమిటి? మనం దేహం కాదు కదా! మనం దేహంకాదు అని మనకు తెలిసినప్పుడు జిన్నూరుకు మనకు సంబంధం ఏమిటి? పుట్టినదానికి ఊరు ఉంటుంది కాని పుట్టనిదానికి ఊరు ఏముంటుంది?

భగవాన్ ఏమని చెప్పారు అంటే నువ్వు ఏదైనా మంచిపనిచేసినా అది ఏదో ఒక జన్మలో అనుభవంలోనికి వస్తుంది. నువ్వు చేసిన మంచి ఈశ్వరునికి అక్కరలేదు. నువ్వు చేసింది నీకే ఇచ్చేస్తాడు. నేను చేసాను అనే భావన నీకు ఉండకూడదు. నువ్వు ఏదైనా మంచిపని చేసావు అనుకో, నీవు చేసిన మంచిపని రామకృష్ణుడికి తెలుసు. అయినా ఎవరు చేసారు అని అడుగుతాడు. నేనే చేసాను అని అంటావు అనుకో పోవలసింది అదే అని చెపుతాడు. అదిపోతే ఇంక నువ్వు శవాలను మోయనక్కరలేదు. నువ్వు మంచి పని చేయటం వలన నీకు పుణ్యం రావచ్చు. పుణ్యం వచ్చినా అది ఎంతకాలం ఉంటుంది. ఒక కాలంలో చేసింది ఇంకోకాలంలో అనుభవంలోనికి వస్తుంది, అది పోతుంది పుణ్యకర్మ పోయినా ఫరవాలేదు అది గతిని నిరోధిస్తుంది. పుణ్యకర్మలు చేసినప్పుడు నీకు ఎన్నో భోగాలు ఇస్తారు. నీకు భోగకాంక్ష వస్తుంది. ఆ భోగకాంక్ష మోక్షకాంక్షను చంపేస్తుంది. ఆ భోగం ఎందుకు వచ్చింది అంటే నీవు పుణ్యం చేయటం వలన వచ్చింది. ఎంత ప్రమాదమో చూడండి. నేను చేస్తున్నాను అనే భావన లేకుండా చేస్తే చిత్తశుద్ధి కలుగుతుంది. నేను చేస్తున్నాను అనే భావనతో మంచిపనులు చేసినా దానివలన పుణ్యం వస్తుంది. పుణ్యకర్మల వలన భోగాలు వస్తాయి. ఆ భోగకాంక్ష పెరిగిపోయి అది మోక్షానికి వెళ్ళే దారిని మూసేస్తుంది. అంటే మోక్షం వైపుకు నీ మొఖాన్ని తిరగనివ్వదు. అందుచేతనే పాపం ఇనుపసంకెళ్ళు, పుణ్యం బంగారు సంకెళ్ళు. నిన్ను కట్టేయటానికి ఏదైనా ఒక్కటే అని చెపుతారు. భోగకాంక్ష వలన ఇంకో ప్రమాదం ఏమిటి అంటే అది రిపీట్ చేయాలని నీకు అనిపిస్తుంది, అదే సంసారం. నువ్వు మంచి చేసి ఉండవచ్చు, చెడ్డ చేసి ఉండవచ్చు. నీ శరీరం చనిపోయేటప్పుడు వాటిని ఇక్కడే వదిలేసి వెళ్ళిపో, కూడా తీసుకొని వెళ్ళవద్దు అని పరమాత్మ చెపుతున్నాడు. కాని మనం అలా వదలము కదా! నేను చేసాను, నేను చేసాను అంటూ ఉంటే వాటిని ఎలా వదలగలము. మేము అంతటా వ్యాపించి లేము అని భగవాన్‌తో అంటే మేము

అంతటా లేము అని అనుకొనేబదులు అంతటావ్యాపించి ఉన్నాము అనుకుంటే సరిపోతుంది. అలా అనుకునేబదులు ఇలా అనుకోండి. ఇది పాజిటివ్ థింకింగ్. పాజిటివ్ థింకింగ్ ఉన్న వాడికి సత్వగుణం వస్తుంది. సత్వగుణం మోక్షానికి దారిచూపిస్తుంది. పుణ్యపాపములను ఇక్కడే వదిలేయమని పరమాత్మ చెపుతున్నాడు కాని వాటిని వదిలేయటం ఎలా కుదురుతుంది అని అడుగుతున్నారు. నీకు ఫలకాంక్ష లేకపోతే వదిలేయవచ్చు, ఫలకాంక్ష పెట్టుకొంటే అవి కూడా వస్తాయికాని ఫలకాంక్ష లేకపోతే వాటిని వదిలేయవచ్చు. నేను పుణ్యం చేస్తున్నాను కాబట్టి ఫలితం నేను అనుభవించాలి అనికొంటావు అనుకో అప్పుడు వాటిని వదలలేవు. ఆ కాంక్ష నీకు లేకపోతే వదిలివేయవచ్చు అని చెప్పారు.

క్షమించటం తేలిక, మర్చిపోవటం కష్టం. జరిగిపోయిన గొడవలు మర్చిపోవటం కంటే మించిన పని లేదు. జరిగిపోయిన గొడవలు మర్చిపోవటం మంచిది. జరిగిపోయిన గొడవలు ఎవడైతే జ్ఞాపకం పెట్టుకొంటున్నాడో వాడు నెత్తిమీద దెయ్యాలను మోస్తున్నాడు. జరిగిపోయిన విషయాలు మర్చిపోతే కర్మ మిమ్మల్ని చుట్టుకోదు. భూతకాలాన్ని మరిచిపోకుండా దానిని మోస్తూ ఉంటే నెత్తిమీద దెయ్యాలను పెట్టుకొని మోస్తున్నట్లే అవుతుంది. ఈ మధ్య సారనాథ్ వెళ్ళినప్పుడు బుద్ధుడు నాపట్ల చాలా దయచూపించాడు. బుద్ధుడు వచ్చి సుమారు 2600 సంవత్సరాలు అయ్యింది. 2600 సంవత్సరాల నాటివాడు ఎలా అనుగ్రహిస్తాడు అని మనకు అనిపిస్తుంది. చైతన్యానికి కాలంలేదు, దూరంలేదు. బుద్ధుడు నిన్ను అనుగ్రహించాలి అనుకొన్నప్పుడు నువ్వు అమెరికాలో ఉన్నా, ఎక్కడ ఉన్నా కూడా అనుగ్రహిస్తాడు. అంటే ఆ స్థితిలో దూరం లేదు, దగ్గర లేదు, కాలం లేదు. ఆస్థితికి ఎదిగివెళ్ళేవరకు నువ్వు నిర్వాణస్థితిని పొందలేవు, మోక్షాన్ని పొందలేవు. ఆయన దయాస్వరూపుడు. ఆయన నిర్వాణపదవి గురించి తప్ప మహిమల గొడవలలోనికి వెళ్ళడు. మహిమల గొడవలు ఎత్తుకొంటే మరల మనస్సు ఆ ప్రక్కకు పోతుంది.

ఎప్పుడైతే ధర్మం తగ్గిపోయి, అధర్మం పెరిగిపోయిందో అప్పుడు నన్ను నేను సృజించుకొంటాను అని పరమాత్మ చెప్పాడు. బుద్ధుడు ఇటువంటి మాటలు చెప్పడు. ఆయనలో వ్యక్తిభావన కనబడదు. ఈ బుద్ధుడు కాకపోతే ఇంకో బుద్ధుడు వస్తాడు అంటే నేనే వస్తాను అని అటువంటి మాటలు ఆయన చెప్పడు. బుద్ధుడికి ఇతరులు లేరు. అందర్‌నెస్ కనుక నీకు ఉంటే ఇంక నువ్వు సుప్రీమ్‌స్టేట్‌ను పొందలేవు. ఇతరులు ఉన్నారు అనేటువంటి భావన నీకు ఉంటే ఇంక నువ్వు దుఃఖాన్ని అతిక్రమించలేవు. కృష్ణుడు గోవర్ధనపర్వతాన్ని ఎత్తాడు. ఏసు ఒక చేపను వంద చేపలు చేసాడు అంటే వారు చేస్తే చేసి ఉండవచ్చు. అది మాయ.

బుద్ధుడు చెప్పింది ఏమిటి అంటే ఒక మనిషి యొక్క మనస్సును బాగుచేసి వాడిని నిర్వాణ పదవిలోనికి తీసుకొనివెళ్ళటం కంటే గొప్ప పని ఈ ప్రపంచంలో ఏదీ లేదు. నీ మనస్సును బాగుచేసి, నిన్ను ప్రకృతిగుణాల నుండి విడుదలచేసి, నీ మనస్సును పవిత్రంచేసి నిర్వాణ స్థితికి నిన్ను తీసుకొనివెళ్ళటమే గొప్పపని. అంతకంటే గొప్పపని కాని, అంతకంటే ఉన్నతమైన పనికాని ఈ సృష్టిలో ఏమీలేదు. నువ్వు కాలేజీలు కట్టించవచ్చు, కాలువలు తవ్వించవచ్చు, అవి తేలికేకాని ఒక మనిషిని బాగుచేయటం చాలాకష్టం. మన గమ్యం ఏమిటి అంటే నిర్వాణపదవి. నీచూపు, నీ మనస్సు అక్కడ ఉండాలి. బుద్ధుడు నీకు ఏదో ఒకమాట చెప్పాడు అనుకో, ఆ మాట ప్రకారం నువ్వు నడుచుకోవటం లేదు అనుకో, ఆయనలో రియాక్షన్ ఏమీ ఉండదు. ఆయన స్థితిలో ఇటువంటి గొడవలు ఏమీ ఉండవు.

నువ్వు హైదరాబాద్ నుండి అరుణాచలం వచ్చావు. అంటే అరుణాచలం ఎలా వెళ్ళాలి? ఎక్కడ రైలు ఎక్కాలి? ఎక్కడ దిగాలి? అని ఆ రూట్ తెలుసుకుంటే నువ్వు ఇక్కడకు రాగలవు. ఆ రూట్ తెలియకుండా నువ్వు ఇక్కడకు రాలేవు. అలాగే నిర్వాణపదవి పొందటానికి రూట్ తెలుసుకోండి. అంటే ఆ గమ్యం చేరేమార్గం తెలుసుకొని ఆ మార్గంలో ప్రయాణం చేయండి. ఇతర మార్గాల వంక చూడవద్దు. నువ్వు అరుణాచలం వచ్చేరూటు తప్పావు అనుకో ఇక్కడకు చేరుకోలేవు. అలాగే నిర్వాణపదవి పొందే రూటు చూసుకుని ఆ మార్గంలో ప్రయాణం చెయ్యి, ప్రక్కదారులు వద్దు అని చెపుతున్నారు. నీ శరీరాన్ని గోదావరి గట్టున దహనంచేస్తే నీకు మోక్షం వచ్చేస్తే ఇంక ఈ సాధనలు, ఈ గొడవలు ఎందుకు? ఇది ఫాల్స్ వ్యూ. నువ్వు ఫాల్స్ వ్యూస్‌లో ఉంటే గమ్యానికి వెళ్ళలేవు. నీలో ఉన్న వాసనలు పూర్తిగా నశించాలి. నువ్వు ఒక మనిషిని ద్వేషిస్తున్నావు అనుకో ఆ మనిషిని చంపినవాడితో సమానము. ఆ మనిషిని ద్వేషించవలసిన పని ఏముంది? అది నేరం. ఎవరో బాగుపడతున్నారు అనుకో, వారిమీద నీకు ద్వేషం ఎందుకు? ద్వేషంతో నువ్వు ఒక వాక్యం మాట్లాడితే ఒక మనిషిని చంపినంత దోషం నీకు వస్తుంది. మనం ఏదైనా ఒక పని చేస్తున్నాము అనుకోండి ఆ పని చేసేటప్పుడు బాగానే ఉంది అనిపిస్తుంది. దాని రిజల్ట్ నీకు అనుభవంలోనికి వచ్చినప్పుడు దానిలో ఉన్న దోషం నీకు తెలుస్తుంది కాని అప్పటివరకు నువ్వు చేసిన పనిలో ఉన్న బేడ్‌నెస్ నీకు తెలియదు, భగవంతుడు నీకు తెలియనివ్వడు, అదే మాయ. నువ్వు చేసేది చెడ్డపని అయినా ఆ పని చేసేటప్పుడు బాగానే ఉంది అనుకొంటావు. దానివలన నీకు అశాంతి వచ్చినప్పుడు, నీ ఆరోగ్యం పాడైనప్పుడు అంటే ఆ పని తాలూక రిజల్టు నీకు అనుభవంలోనికి వచ్చినప్పుడు దాని బేడ్ ఎఫెక్టు నీకు తెలుస్తుంది కాని అంతవరకు తెలియదు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| డిసెంబర్ | 21 | జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం |
| జనవరి | 6 | జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం - భగవాన్ జయంతి |

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

**- Mahabharatha**



పాలకొల్లులో ఐకాన్స్ షోరూమ్ (ఇంటీరియర్ డెకరేషన్) ను

ప్రారంభిస్తున్న సద్గురు శ్రీ నాన్నగారు

# తనలోని సత్యాన్ని తెలుసుకోలేని జన్మ - వ్యర్థం

దేన్ని పొందిన తరువాత ఇక పొందదగినది ఏమీ మిగలదో దాన్ని పొందటమే జీవిత లక్ష్యం. ఆ లక్ష్యం కోసం ఎవరు కృషి చెయ్యరో వారి జన్మ పశుజన్మతో సమానం. శరీరమనే మట్టి ప్రమిదలో వెలిగే జీవన జ్యోతిని వెదకాలి. అలవాట్లు ఒక జీవితంలో వచ్చినవి కావు. లక్షల కొద్ది జన్మల్లో కూడబెట్టుకున్నది. వాగుబోతు మనస్సును గమనించేకొద్ది దాని వాగటం ఆగిపోతుంది. రోజూ కొంత సమయ స్మృతిపూర్వకంగా గడిపితే మనస్సుకు ఆహారం దొరకక నెమ్మదిగా పలచబడి, బరువు తగ్గి చావటం ప్రారంభమవుతుంది. అప్పుడు స్పష్టత కలిగి అద్దంలా అయిపోతుంది. దీనికి ముందు గురు సమక్షంలో ప్రక్షాళనను ప్రేరేపించే కార్యంతో పరివర్తన ప్రారంభమౌతుంది. సూర్యోదయం కాగానే మొగ్గలు విచ్చుకోవటం ప్రారంభమై పుష్పాలు తయారౌతాయి. సూర్యుడు మొగ్గల రేకులను విప్పి పుష్పంగా మారుస్తాడని కాదు. ఆయన సమక్షమే పుష్పంగా మారిపోతుంది. గురువు మన సామర్థ్యాన్ని మనతోనే గుర్తించేసేటట్లు చేస్తారు. ఆయన మనలా శరీరంగా ఉన్నా ఆయన సమక్షం మనలను కుదిపేస్తుంది. శక్తులు పైకి తేలటం ప్రారంభమౌతాయి. దానికి నిరంతరం గురుధ్యాస కావాలి. ప్రొద్దు తిరుగుడు పువ్వు సూర్యుని వైపుకు తిరిగినట్లు, గురువు నా రక్షకుడు అనే భావం కావాలి. గురువు సత్య వాక్కు మనలో గొప్ప పరివర్తనను తీసుకొని వస్తుంది. గురువు చెప్పిన గురుతులతో మనం పయనించాలి. మన పొరపాట్లు తెలుసుకొని తిరిగి చెయ్యకుండా చూచుకోవాలి. ఇతరులు మనలను బుద్ధిమంతులన్నా వాళ్ళ కళ్ళతో మనం చూస్తే అది విలువ అనిపిస్తుంది. లేదా వాళ్ళు అవమానించి బుద్ధి తక్కువ వాడన్నా అది మనం నమ్మితే మన కీర్తి నాశనమైపోయింది అని వాపోతాము. వాళ్ళు అలా అంటే అది వాళ్ల రోగం. ఇటువంటి సమాజంలో జీవిస్తూ బానిసగా బ్రతుకుతున్నాము. మనం వారి భ్రమలను బలపరుస్తూ భ్రమల వ్యాపారంలో భాగస్తులమైపోతున్నాము. మన ఉనికి ఏమిటో మనకు అనుభవ పూర్వకంగా తెలిస్తే ఇతరులు ఏమనుకొన్నా మనకెందుకు. శ్రీనాన్నగారు "అనేది అహంకారమే, పడేది అహంకారమే, ఎందుకు ఈ గోల" అంటారు. ఏసు "ముందు దైవరాజ్యాన్ని వెదుకు మిగతా సౌకర్యాలు అన్నీ వాటంతట అవే వస్తాయి" అన్నాడు. గురువును అనుసరించాలి గుడ్డివారిని కాదు. మన ప్రాజ్ఞ ప్రభావాన్ని వెలిగించి, నిర్మలంగా, నిరంతరంగా వెలగాలి. అరువు తెచ్చుకొన్న ఆలోచనల మోహంలో పడి సత్యానికి దూరం కాకూడదు. జీవితాన్ని వెదకాలి. లేకపోతే మరణమే మనలను వెంటాడుతుంది. డబ్బు, అధికారం, పదవి, పేరు ప్రతిష్ఠలు ఈరోజు ఉండి రేపు ఊడిపోతాయి. అన్నీ మరణం ముందు జీవం లేని నీడలులాంటివి. మారనిది సత్యాన్ని పట్టుకోవాలి. ప్రకృతి సుఖాలే ఆనందం అనుకోకూడదు. సత్యాన్ని తెలుసుకోవటానికి ఈ జీవితం ఒక అవకాశం, దాన్ని సార్థకం చేసుకోవాలి.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966**